క్లుప్తంగా

నేడు వీఆర్‌ఓల సమావేశం

గిద్దలూరు రూరల్: జిల్లాలోని గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారం కోసం ఒంగోలులోని వీఆర్‌ఓల సంఘ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వై.పి.రంగయ్యయాదవ్, కార్యదర్శి సీహెచ్ ఆదిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో సిబ్బంది సర్దుబాటు, ఇతర సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు పి.మధుసూదనరావుతో కలిసి కలెక్టర్‌కు సమస్యలు వివరించనున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓల సంఘం సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

కొనకనమిట్ల: మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు పొదిలిలోని వివేకానంద జూనియర్ కాలేజీ ఆవరణలో మార్కాపురం వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కొనకనమిట్ల మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 28న పొదిలి వస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఉడుముల శ్రీనివాసుల రెడ్డి, ముఖ్య నేతలు పాల్గొంటారని, అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.


మందుబాబులకు రూ.40 వేలు జరిమానా

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ ఒక్కొక్కరికి 10 వేల చొప్పున మొత్తం రూ.40 వేలు జరిమానా విధించినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హనుమంతుడికి విశేష పూజలు


బొడిచర్లలో ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి

మార్కాపురం: మండలంలోని బొడిచర్లలో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతం, హనుమాన్ చాలీసా పారాయణం, 11 గంటలకు స్వామివారికి ఆకుపూజ, అష్టోత్తర శత నామ పూజలు చేశారు. ఉభయ దాతగా టీవీ బాపనయ్య దంపతులు, అన్నదాన కార్యక్రమానికి జి.కాశిరెడ్డి, కోటిరెడ్డి తరుపున కుమారులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మరమ్మతులకు నోచుకోని పెద్ద ఓబినేనిపల్లె చెరువు తూము


పెద్ద ఓబినేనిపల్లె చెరువు పంట కాలువ దుస్థితి

సాగునీటికి సంకటం

- మరమ్మతులకు నోచుకోని చెరువులు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్న పాలకులు

బేస్తవారిపేట: పాలకుల నిర్లక్ష్యం కారణంగా సాగునీటి చెరువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. వర్షాలు కురిస్తే సవ్యంగా పంటలు పండించుకోవచ్చని ఆశించిన రైతులకు ఏటా భంగపాటు తప్పడం లేదు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పెడచెవిన పెడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బేస్తవారిపేట మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె కొత్త చెరువు మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీరు వృథాగా పోతోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ చెరువు తూముకు ఏర్పాటు చేసిన ఇనుప గేట్ తుప్పు పట్టింది. దీంతో వర్షాకాలంలో చెరువులోకి చేరిన నీరంతా వృథాగా పోవడం తప్ప పొలాలకు వినియోగించుకునేందుకు వీలుపడటం లేదు. పంట కాలువల్లో సైతం చిల్లచెట్లు పెరిగి పూడిక పేరుకుపోయింది. ఫలితంగా చెరువు పరిధిలోని 120 ఎకరాలకు సాగు నీరు అందక బీడు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది.

పూసలపాడు గ్రామ చెరువుకు మరమ్మతులు చేయించడం.. వర్షాలు కురవగానే మళ్లీ గండి పడటం.. ఇదే తంతుగా కొనసాగుతోంది. ప్రస్తుతం గండి పడిన చోటనే గతంలో నాలుగు పర్యాయాలు కట్ట కోతకు గురైంది. 2020లో రూ.1.85 కోట్లతో కట్టకు మరమ్మతులు చేపట్టడంతోపాటు కట్ట తెగిన ప్రదేశంలో కాంక్రీట్ గోడతో అలుగు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. మరమ్మతులు పూర్తయిన ఆరు నెలల తర్వాత 2022లో భారీ వర్షాలు కురవడం, పైఎత్తున ఉన్న పెంచికలపాడు చెరువు కట్ట తెగి పూసలపాడు చెరువులోకి నీరు చేరడంతో మరోమారు గండి పడింది. దీంతో చెరువు ఆయకట్టు పరిధిలోని 700 ఎకరాల భూముల సాగు ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే భూగర్భజలాలు వృద్ధి చెంది బోర్లకు నీరు సమృద్ధిగా అందే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. పన్నెండుళ్లుగా చెరువులో సక్రమంగా నీరు ఉండకపోతుండటంతో బత్తాయి తోటలను నరికి వేయాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖాధికారులు స్పందించి చెరువు కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


గండి పడిన పూసలపాడు చెరువు

చిన్నపాటి వర్షాలకే గండ్లు

పూసలపాడు చెరువు కట్టకు తరచూ గండ్లు పడటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేయకుండా ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారు. చిన్నపాటి వర్షాలకే పూసలపాడు చెరువుకు గండ్లు పడుతున్నాయి. చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరితే 700 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయి.

– బొల్లా బాలిరెడ్డి, పూసలపాడు

కాలువలు కూడా బాగు చేయాలి

ఓబినేనిపల్లె చెరువుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువు తూము షట్టర్లు తుప్పు పట్టి పాడయ్యాయి. ఇరిగేషన్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతోంది. పంట కాలువల్లో చిల్లచెట్లు మొలిచి రూపు లేకుండా పోయాయి. వాటిని కూడా బాగు చేయాలి.

– వెన్నా భాస్కర్‌రెడ్డి, పెద్ద ఓబినేనిపల్లె

గోప్యంగా వదిలేశారా?

- మార్కాపురంలో రోడ్లపైకి ఆవులు
- తాత్కాలిక గోశాల నిర్వహించలేకనేనా?
- పట్టణంలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం

మార్కాపురం టౌన్: డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో గోవులు మళ్లీ రోడ్డెక్కాయి. వీధుల్లో చెత్త కుండీల వద్ద ఆహారం, ప్లాస్టిక్ కవర్లు తింటూ.. ప్రధాన రహదారులపై సంచరిస్తూ.. రాత్రి వేళ రోడ్లపైనే పడుకుంటున్నాయి. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రాత్రి వేళ గుర్తు తెలియని వాహనాలు ఢీకొడుతుండటంతో ఆవులు గాయపడుతున్నాయి. ఆవుల యజమానులు వదిలేయడంతో వీటి సంతతి క్రమంగా పెరిగిపోతోంది. మార్కాపురం పట్టణంలోని ప్రధాన రహదారితోపాటు మున్సిపల్ కార్యాలయం, సత్యనారాయణస్వామి గుడి, మార్కెట్ సెంటరు, దోర్నాల బస్టాండ్, నాయుడుబజారు, రాజాజీ వీధి తదితర ప్రాంతాల్లో ఆవులు సంచరిస్తున్నాయి. ఇటీవల ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే క్రమంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు కలిసి తాత్కాలిక గోశాల ఏర్పాటు చేశారు. రోడ్లపైన సంచరించే ఆవులను గోశాలకు తరలించి కొద్ది రోజుల పాటు దాణా అందజేశారు. ప్రస్తుతం యథావిధిగా ఆవులు రోడ్లపైన సంచరిస్తుండటంతో సంరక్షించలేక వదిలేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆవులను గోశాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.


మార్కెట్ వద్ద సంచరిస్తున్న ఆవులు

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరిస్తా

- సబ్ కలెక్టర్ త్రివినాగ్


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్, అధికారులు

మార్కాపురం టౌన్: ఎస్సీ, ఎస్టీ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని సబ్ కలెక్టర్ త్రివినాగ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీల సమస్యలు గుర్తించి తెలియజేయాలని సభ్యులను కోరారు. సభ్యుడు బూదాల గురవయ్య మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీల శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలని కోరారు. కమిటీ కన్వీనర్ ఏఎస్ డబ్ల్యూఓ అరుణ మాట్లాడుతూ.. అపరిశుభ్ర పనులను మనుషులతో చేయించడాన్ని ప్రభుత్వం నిషేధించిందన్నారు. కార్యక్రమంలో పలువురు తహసీల్దార్లు, పట్టణ ఎస్సై సైదుబాబు, సభ్యులు రోజ్‌లిడియా తదితరులు పాల్గొన్నారు.


హనుమంతుని కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కమనీయం.. ఆంజనేయస్వామి కల్యాణం

- ఒంటి వాహనంపై అభయాంజనేయ స్వామి గ్రామోత్సవం

కొనకనమిట్ల: హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టులో శుక్రవారం అభయ వీరాంజనేయ స్వామి, సువర్చలాదేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను రమణాచార్యులు శోభాయమానంగా అలంకరించగా వేదపండితులు వినుపాముల రామకృష్ణశర్మ కల్యాణ క్రతువు పూర్తి చేశారు. స్వామివారికి గ్రామ పెద్దలు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడంతోపాటు పుష్పాభిషేకం చేయించారు. రాత్రికి ఉత్సవ విగ్రహాలను ఒంటి వాహనంపై ఊరేగించారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం

కొనకనమిట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మార్కాపురం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య విమర్శించారు. మండల కేంద్రం కొనకనమిట్లలోని గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో సీపీఐ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ 5వ మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందే తప్ప రైతులను ఆదుకోవడం లేదన్నారు. అధికారంలో ఉన్న వారు సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల పక్షాన నిరంతర పోరాటం చేస్తామని చెప్పారు. ముందుగా పార్టీ జెండాను సీపీఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకులు పి.లక్ష్మినరసయ్య, జి.వెంకటరెడ్డి, వి.వెంకటేశ్వర్లుకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్కే కాశీం, కోటిరెడ్డి, కె.కోటేశ్వరరావు, పి.కొండయ్య, శిగినం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అందె నాసరయ్య

పికప్ ఆనకట్ట పరిశీలన

గిద్దలూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో పికప్ ఆనకట్టను స్థానిక ఇరిగేషన్ డీఈ రామారావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పికప్ ఆనకట్ట నుంచి వెంగల్‌చెరువు, వావిళ్లకుంటకు వెళ్లే సప్లయ్ చానల్‌ను తనిఖీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సప్లయ్ చానల్‌లో అక్కడక్కడ కొంత మేర కట్టలు తెగిపోయి ఉండటాన్ని గమనించారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ సుధాకర్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బొర్రా శేఖర్‌యాదవ్, గుండ్లమోటు నీటి సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఆనకట్టను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


కంభంలో యోగాపై అవగాహన కల్పిస్తున్న ఫిజియోథెరపిస్ట్

కంభం: రోజూ వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఎంపీడీఓ వీరభద్రాచారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిజాం ఫిజియోథెరపీ నిపుణులతో యోగా, వ్యాయామంపై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫిజియోథెరపీ నిపుణుడు వెంకటరమణ మాట్లాడుతూ.. సెల్ ఫోన్ వినియోగం పెరిగి ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారని తెలిపారు. రోజూ వ్యాయామం, వాకింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయలక్ష్మి, ఏఓ అబ్దుల్ ఖాదర్, ఏపీఓ జీవరత్నం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్లో కష్టాల ఖాతా!

- సేవలు సక్రమంగా అందక ఖాతాదారులకు అవస్థలు
- భారీగా ఉద్యోగుల ఖాళీలు.. వేధిస్తున్న సిబ్బంది కొరత
- మార్కాపురం పరిధిలో సుమారు 6.41 లక్షల ఖాతాదారులు

మార్కాపురం:

గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజల సొమ్ముకు భద్రత, భరోసా ఇస్తూ వారి అభిమానాన్ని చూరగొన్న పోస్టల్ శాఖను సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. పదవీ విరమణలు, బదిలీల కారణంగా ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఖాతాదారులకు సక్రమంగా సేవలందడం లేదు. దీంతో ఖాతాదారులు విధిలేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మార్కాపురం పోస్టల్ డివిజన్ పరిధిలో మార్కాపురం, పొదిలి హెడ్ పోస్టాఫీసులు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 49 సబ్ పోస్టాఫీసులు, 400కు పైగా బ్రాంచ్ పోస్టాఫీసులు ఉండగా సుమారు 6.41 లక్షలకుపైగా ఖాతాదారులు నమోదై ఉన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టల్ శాఖను ఆధునీకరించినప్పటికీ సిబ్బంది కొరత వేధిస్తోంది. మార్కాపురం, పొదిలి హెడ్‌పోస్టాఫీసుల పరిధిలో 16 పోస్టుమాస్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం మీద 24 మంది సిబ్బంది కొరత ఏర్పడింది. దీంతో ఉన్నవారిలోనే ఆయా పోస్టాఫీసులకు రోజుకో పోస్ట్‌మాస్టర్‌ను డిప్యుటేషన్‌పై పంపి ఖాతాదారులకు సేవలందిస్తున్నారు.

సుమారు 19 వేల మంది ఖాతాదారులను కలిగి ఉన్న వేములకోట సబ్ పోస్టాఫీసులో గత కొన్నినెలలుగా రెగ్యులర్ పోస్టుమాస్టర్ లేకపోవడంతో సేవల్లో జాప్యం జరుగుతోంది. మిగిలిన చోట్లా దాదాపు ఇదే పరిస్థితి. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు, ప్రభుత్వం అందించే గ్యాస్ రాయితీలను ఖాతాదారులు సకాలంలో పొందలేకపోతున్నారు. ఓ వైపు సిబ్బంది కొరత వేధిస్తుండగా.. మరోవైపు పోస్టల్ ఉన్నతాధికారులు పెడుతున్న టార్గెట్స్‌తో ఉద్యోగులు సతమతం అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ సేవింగ్స్ ఖాతాలు తెరవాలని ఉన్నతాధికారులు పదేపదే ఆదేశించడం సిబ్బందిని ఆందోళనలోకి నెడుతోంది. దీంతోపాటు ఇన్సూరెన్స్ పాలసీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని చెబుతుండటంతో ఏ పని చేయాలో అంటూ తల పట్టుకుంటున్నారు. వివిధ పథకాల కోసం అకౌంట్లు ఓపెన్ చేసేందుకు ఖాతాదారులు వస్తున్నప్పటికీ సిబ్బంది కొరత మూలంగా సకాలంలో సేవలు లభించడం లేదు. ఇదిలా ఉండగా మార్కాపురం పట్టణంలో హెడ్‌పోస్టాఫీసు పక్కన ఉన్న ఏటీఎం సెంటర్ గత మూడు నెలల నుంచి పనిచేయడం లేదు.


మార్కాపురంలోని హెడ్ పోస్టాఫీసు

త్వరలోనే సిబ్బంది నియామకం

మార్కాపురం హెడ్‌పోస్టాఫీస్ పరిధిలోని ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. కొన్ని పోస్టాఫీసుల్లో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ డిప్యుటేషన్‌పై ఉద్యోగులను అక్కడికి పంపి పోస్టల్ ఖాతాదారులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. త్వరలో సిబ్బంది నియామకం జరుగుతుంది.

– జీవీ శ్రీనివాసులు, పోస్టల్ సూపరింటెండెంట్, మార్కాపురం